# స్త్రీ పురుష భేదంగురించి

'అనసూయ'

(మగని చెవిలో)

ఆహా! ఇదేకదా ఆడవాళ్లకీ మొగవాళ్లకీ భేదం? మీరు జర్రున చీదితే బెంగపెట్టేసుకొని హడలెత్తిపోయి నిద్రలేకుండా తిండిలేకుండా కాపలా ఉంటాము మేము! మాకు ఒంటికివస్తే ఇంతేగదా! చచ్చేమో బ్రతికేమో తిరిగిచూడనైనా చూడరు మీరు! ఎంతసేపూ మీక్లబ్బూ, మీస్నేహితులు, మీ పేకాటా, మీ గొట్టికాయలాటా, మీ బాతాఖానీ, ఇవన్నీ దిల్లగా ఉంటే చాలు మీకు! మేము ఎలాగుపోతేనేమిటి? కట్టుకున్న పెళ్లాం ఎక్కడికి పోతుందని తృణీకారం! పోనీ పుట్టింటికేనా పోయి హాయిగా ఏ ఆరునెల్లపాటో ఉందామంటే నేను అంత అదృష్టానికి నోచుకోలేదుగదా! ఈ యింట్లో యిలాగు పాతిపెట్టేసి తిరిగి చూడకపోతే ఏమిటి సాధనం? డాక్టరును పిలిపించడంలేదు, మందు యిప్పించడంలేదు, పోనీ మనిషి యెలాగువున్నదో మీరైనా తొంగిచూడడములేదు!

"ఈవూరు వైకుంఠయాత్ర వైద్యులచేత మందిప్పించడంకన్న మానేస్తేనే తెరిపి."

నాగురించి అంతపని యెప్పుడైనా పుడుతుందా? ఈజబ్బులు బాధపెడతాయి గాని ప్రాణాలుతీసీవు! అలా తీసేస్తే ఏవిచారమూ లేదు! పోనీయండి ఎలాగున్నాది అని అడగడానికేమిటి ఆటంకం? ఎంతసేపూ, 'పనితొందర, తీరుబాటులేదు' అని వేషాలు వేస్తారు! నాలుగుగంటలనుండి తొమ్మిదిగంటలదాకా క్లబ్బులో పేకాటలాడడానికీ గొట్టికాయలాడడానికీ, వాడిపెళ్లాం అలాగు, వీడిపెళ్లాం యిలాగు, అల్లది వంగొని వంకాయతింది, ఇల్లిది తొంగొని దోసకాయతింది, అని బాతాఖానీ కొట్టడానికీ తీరుబాటు ఉన్నదికాని కట్టుకొన్నపెళ్లానికి జబ్బువచ్చి పడిపోతే గడియసేపు సంరక్షణ చేయడానికీ మందు యిప్పించడానికీ తీరుబాటులేదూ? అంత తీరుబాటు లేదని మీదినచర్యలలో యేమిటి మానేసేరు? ఒక పని మానేసినానని వేలుమడిచిచెప్పండి చూస్తాను! అన్నిటికీ ఉన్న తీరుబడి పెళ్లాంగురించి కనుక్కొందికి లేదూ? ఈవూరివైద్యులందరూ పనికిమాలినవాళ్లేనా? వందలకొద్దీ జీతాలు తెచ్చుకుంటున్నారు, జబ్బులు కుదురుస్తున్నారు, వాళ్లు మందిచ్చినవాళ్లంతా చనిపోయేరాయేమిటి? మీ అశ్రద్ధకు అదో సమాధానపు మిషగాని మరేమీగాదు. అభిమానమున్న మగవాడు అలాగని ఊరుకుంటాడా? గాబరాపడి కంగారెత్తి ఏచచ్చు డాక్టరునైనా తీసికొనివచ్చి శక్తివంచన లేకుండా ఇన్ని మందు నీళ్లు ఇప్పిస్తాడు! ఇంతకూ తమకు అట్టి అభిమానం ఉంటేగదూ! అభిమానం అన్నది మనస్సులో పుట్టాలిగాని తాటిచెట్టెక్కేవాడిని ఎంతకని ఎగసనతోయగలము? కొబ్బరికాయలో నీరూరినట్లు ప్రేమ ఊరాలి! ఆహా! మీచదువుకొంటూ ఉన్నరోజులకీ యిప్పటికీ యెంత భేదం? అదంతా నిజమో అబద్ధమోగాని కలలాగు జరిగిపోయింది! ఆ ప్రేమ, ఆ అభిమానము, ఆ ఆదరణ అవి యెన్నటికీ మరుపురావుగదా! అప్పుడు గంటలకొద్దీ నావద్ద కూర్చొని మాట్లాడుతూ కాలక్షేపము చేసినప్పుడు నావద్దనుండిన గొప్పగుణము లేమిటి? ఇప్పుడులేనివేమిటి? అప్పుడు మాట్లాడడానికి ఉండిన హంశము లేమిటి? ఇప్పుడు లేనివేమిటి? మనస్సులో ఉండిన ప్రేమవల్లనే అట్లు హంశములూ మాటలూ గౌరవమూకూడా ఊరుతూ ఉండేవి! ఇప్పుడు మరేమీ అక్కర్లేదు, దిక్కుమాలిన క్లబ్బు ఉంటే చాలును! మాట్లాడడానికి కబుర్లే లేవట! పోనీ మాట్లాడవద్దు; యిలాగు జ్వరంగా ఉన్నప్పుడైనా ఎలాగున్నదని తిరిగి చూడకపోతే ఎంతశాంతముగల పెళ్లానికైనా ఒళ్లుమండుతుంటా మండదా? నిజంగా పరపురుషుడిని పొగడకూడదుగాని మన పొరుగు కృష్ణారావువంటి అభిమానముగల మొగుడు నూటికీ వేయికి ఒకడుకూడా ఉండడని చెప్పవచ్చును!

'ఏం! పై వాడిమీద కన్నేస్తున్నావా యేమిటి!'

పై వాడిమీదేకన్నువేస్తే మిమ్మలినిపట్టుకొని యిలాగు యేడవడం యెందుకు? అది లేకపోబట్టే యింతగానన్ను మీరు కాల్చుకొని తింటూఉన్నారు! ఆ కృష్ణారావుమాత్రం క్లబ్బుకువెళ్లడూ?

అతడెప్పుడువస్తాడు? మీరెప్పుడు వస్తారు? ఇట్టె వెళ్లి అట్టెవస్తాడు! మగ్గంలో కండెలాగు! మొన్నను అతనిభార్యకు పదిహేనురోజులు జ్వరం వచ్చినప్పుడు అతడు ఎలాగు ఆమెకు సంరక్షణచేసేడో మీకన్నులతో మీరు చూడలేదూ? ఆ పదిహేను రోజులూ ఆడపనీ మొగపనీ కూడా అతనికేకదూ? పువ్వులాగు సంరక్షణచేసేడు! ఎప్పుడూ కాళ్లకట్టునే కూర్చునేవాడు! అలాగు ఏదో కబుర్లో కథలో చెబుతునే ఉండేవాడు! జావలుకాచేవాడు. మందులు మాకులు యిచ్చేవాడు! పిల్లలకి సంరక్షణ చేసేవాడు! కంటిమీద కునుకైనా లేకుండా కాచుకొని వచ్చేడు! దానివల్ల వాడికేమైనా కీర్తి లోపమైపోయిందా? జబ్బుతో బాధపడుతూవున్న పెళ్లామును తిరిగిచూడకుండా మీసాలు తిప్పుకుంటూ మీరు తిరిగినంతమాత్రము చేత మీకు కీర్తివెలిపోవచ్చిందా? చక్రవర్తులై పోయినారా? పోనీ, మీకంత తీరుబాటు లేకపోతే ఒకమాటు డాక్టరుకు చెప్పిఉంటే బంట్రోతు గుంటడైనావెళ్లి యింతమందుతెచ్చి పారేస్తాడుగట! తక్కిన వాటికా! తక్కినవాటికి దైవమే ఉన్నాడు! గిడగిడ గింజుకున్నా మీ అమ్మా అప్పా కాస్త జాలైనా చేసి పొయ్యారుగదా! పిల్లలని చూడరుగదా! ఆబంట్రోతు గుంటడు ఉండబట్టి యింకా కొనఊపిరితో ఉన్నాను! లేకపోతే యీపాటికి మీకు నాబాధ నివారణఅయి పోయియుండును. వాడిధర్మమాఅని వాడు కుంపటిలో అగ్గిచేపి ఇన్నినీళ్లు పడేస్తే దానితోనే నే నెలాగో జావ చేసుకొని బాధపడుతూ ఉన్నాను. (అవునుగాని మీ అమ్మావాళ్లకి అంత శత్రుత్వానికి నేనేమిచేసేనండీ? శత్రువులవంటివాళ్లకు జబ్బుచేస్తే ప్రాణము నిలబడడానికి ఏదోమనసు చేతనైన సాయముచేస్తాము గదా, ఆలాంటిది వాళ్లు ఈగదిలోనికిరారు! తొంగి చూడరు! ఎలాగుఉన్నదని అయినా అనరు! లోకులు విని చీవాట్లుపెడతారని అయినా వాళ్లకి లక్ష్యము లేదు. ఏమిదారుణపుమనుష్యులండీ! అవును, వాళ్లను అనవలసినపనేముంది? వాళ్లకూ నాకూ రక్తస్పర్శా? బంధుత్వమా? పేగా? పెత్తనమా? అడివిపుసిరికాయ, సముద్రపుఉప్పూ, ఏమిటి సంబంధము? అర్ధశరీరమని అగ్నిప్రదక్షిణాలుచేసి కంఠానికి మంగళసూత్రంకట్టి పెళ్లాడిన మీకే నామీద ఆశాపాశాలేకపోతే వాళ్లకెందుకుంటుంది? కండనులేని దురద బచ్చలికా? మీరు చులకనచేయబట్టే వారికి చులకన అయిపోయినాను; మొగుడుకొడితే మాధుకరంవాడుకూడ కొట్టినాడుట! అలాగైంది నాబ్రతుకు! మీకు జింప్వాలేకపోబట్టే వారినోట్లో పడిపోతున్నాను! మీకు అభిమానమూ ఆశా కొంచెమైనా నామీదఉంటే నా బ్రతుకు ఇంత అవాడీగాఉండదు! ఈ అభిమానమూ ఆశా అణి చేస్తూవున్నది ఈక్లబ్బే! మీరుక్లబ్బువెర్రి కొంచెము తగ్గిస్తేనేగాని మనసంసారము ఎత్తిల్లేటట్లు లేదు! అయిదుగంటలసేపు క్లబ్బులో కాలక్షేపంచేసి వేస్తే మరి పనిపాట్లు చూసుకోవడమూ యిల్లు సంసారము పెళ్లాం పిల్లలు, వీళ్లసంగతి కనుక్కోవడమూ, వీటికి టైముఏదీ? ఎవడుపెట్టేడో యీక్లబ్బు మాబాగాపెట్టేడు! ఆడవాళ్లందరూ సభచేసిగవర్నమెంటుకి రాస్తే నెమ్మది భంగం కలుగచేస్తాయని చెప్పి యీక్లబ్బులు తీసేస్తారేమో! ఇదెక్కడచేటు క్లబ్బువచ్చిందమ్మా! 'పెళ్లాంచచ్చినా క్లబ్బుపక్కనుంచే లేస్తారుగద! అప్పుడు మాదా'మన్నరకములో నికిదిగేటట్లు కనుపిస్తూ ఉన్నాది, అంతకంతకు మీ వైఖరివాస్తే! శాసనసభలో కాలుపెట్టనియ్యండి! దానిసంగతి చెప్తాను! దానిపని పట్టిస్తాను!

"ఏమిటిచేస్తావు? క్లబ్బులు మూసీమవడానికి శాసనసభకేమి అధికారముంది?"

మీసాగు హక్కులుతీసేసి రైతులకి యిచ్చేడానికి సభవారికి అధికారంఉందీ? మీక్లబ్బు హక్కులు

మాత్రం తీసేసి మాచేతుల్లో పెట్టడానికి అధికారం లేదూ? అసలు వట్టినే క్లబ్బులు తీసీమని ఏదో తెలివి తక్కువ చట్టము పెడతానను కున్నారా యేమిటి? క్లబ్బులు ఒక్కమారు మూసీమంటే ఇప్పుడు బొబ్బిలి రాజావారిమీద అగ్రహారీకులు యేడుస్తున్నట్లు నామీద పడియేడుస్తారు మీలాంటి క్లబ్బువాళ్ళం దరూ! అంచేత అలాగుచేయను. మరేంచేస్తానో తెలుసునా? ఆపాటి తెలిస్తే యీ ఊబిలోయెందుకు ఉండిపోతారు? చెప్తాను వినండి! క్లబ్బుకువెళ్లే ప్రతీ మెంబరూ తన పెళ్లాముతోకూడా అక్కడికి వెళ్లాలనీ, ఒక్కడూ వెళ్ళకూడదనీ, వెళితే వెంటనే గెంటించీడమేకాకుండా మేస్రేటు దగ్గర శిక్షకూడా వేయించడమగుననినీ్న, ఈ మొదలైన రూల్సు క్రమంగా అమలు జరుగుతూ ఉన్నట్లు చూడడానికి ఒకముసలి ఆడ అధికారిని గవర్నమెంటువారు నియమించి క్లబ్బుసొమ్ములో నుంచే దానికి జీతమిస్తూ ఉండవలసిందనీ, యీమోస్తరుగా యింకా కొన్ని కొన్ని షరతులతో చట్టము ప్రవేశపెట్టేనంటే ఆడవాళ్ళందరూ, అంటే ఒక మొగుడినిపట్టుకొని వేలాడే నాలాంటి ఆడవాళ్ళందరూ, నన్ను ఆమోదించడమే కాకుండా బ్రహ్మరధంపట్టేసి, ఆచట్టము సభలో మోసేసేటట్లు మొగమెంబర్ల ప్రాణాలుపీకీకుండా ఉంటారూ?

"బాగానేఉంది కాని ముసిలి దెందుకూ?"

ఎందుకా! నేనేం అంతవెర్రిబాగులదాన్నిఅనుకున్నారా? ప్రపంచజ్ఞానం లేదనుకున్నారా? పడుచుదాన్ని ఉంచితే పదిరోజులలో దాన్ని మీకోడె మెంబర్లు వలలో వడేసుకొని చట్టాన్ని చంపీరూ?

"ముసలిదానికిమాత్రం నల్లమందిచ్చి మచ్చికచేయలేమూ?"

ఇలాంటి ముసలిముండలమీదికి ఇన్సపెక్టరు, ఇన్సపెక్టర్లమీద సూపరెంటు, ఇవన్నీ యేర్పాటు కావనుకున్నారాయేమిటి? మచ్చికని చెప్పిన యీ రెండు సంగతులతో చట్టమంతా అయిపోయిందని అనుకోకండి! దానికి యెన్ని చీలికలు, శాఖలు, కొమ్మలు, ఆకులు, పువ్వులు, పింజలు, అల్లిసభలో ప్రవేశపెడతాననుకున్నారు?

"చట్టము అమలులోనికివస్తే నీవుకూడా నాతో వస్తావు క్లబ్బుకి! ప్రమాదమేమిటి?''

నేనొక్కరైనూవస్తే కుదురుతుందీ? మనఆడంగులేం దొరసానులాయేమిటి పిల్లలిని సీమ పంపించేసి పాడీగా తిరగడానికి! మనకు దాసీలు ఆయాలు లేరు కదా! నాతోపాటు పిల్లలందరూకూడా వస్తారు! ఇలాగే ప్రతిమెంబరు పెళ్లామూ పిల్లల సహితంగా క్లబ్బుకి వెళిపోవస్తే అదో పెద్దపందులదొడ్డిలాగు తయారుఅయిపోతుంది! అప్పుడు ఎవరూకోరనక్కరలేకుండానే క్లబ్బు దానంతట అదే మూతపడిపోతుంది! ఒకనెలజీతంమాత్రం ముడితేచాలును ఈబాపతు ఉద్యోగస్థులకి, చట్టముయొక్క ఉద్దేశము నెరవేరిపోతుంది!

ఏమైనా ఈచట్టము శారదా ఆక్టుఅంత చచ్చు చట్టము కానేరదనుకుంటాను. దాన్నిలక్ష్యపెట్టకుండా పెళ్లిళ్లుచేసేస్తున్నారు! గవర్నమెంటువారికి నూరురూపాయిలు దాఖలుచేసి ముక్కులో పుల్లపుట్టి కదిపితేగాని వారు దఖలుపుచ్చుకోరు! ఎవరికిపట్టింది ఆబాధపడడానికి! నా చట్టము అలాంటిది కాదు! ఏ రూలు తప్పినా, ఆతప్పిన మెంబరు పెళ్లామే ఫిర్యాదీ! అది అనాదైతే ఆ యిరుగుదో ఆ పొరుగుదో లేక క్లబ్బును బల్లిలాగు కనిపెట్టుకొని ఉండే గవర్నమెంటువారుంచే ఆ అడ అధికారో ఎవళ్లైనా ఫిర్యాదుచేయవచ్చును. ఇలాంటి చట్టము మోస్తరు యెత్తేదో వెయ్యాలిగాని ఒక్కమారు దుడ్డుదెబ్బకొట్టేసినట్లు క్లబ్బులు మూసేసేమంటే ఘోరం ఘోరం అని మీలాంటివాళ్లు దొర్లి

దొర్లి యేడపడమేకాకుండా గవర్నరుగారి పాదాల మీద పడదామనీ వైస్రాయిగారి విమానానికి సాష్టాంగపడదామనీ యీ చట్టానికి అంగీకారం యివ్వవద్దని బ్రతిమాలుదామనీ మీటింగులు, వైర్లు, యేర్పాటుచేసేసి యేక హడావడిచేసేరూ? అందుచేత సాసనసభవారికి అధికారంలేదనుకోకండి! సవరణచట్టాలతోనే హక్కులుపీకి పారేస్తూఉంటే కొత్తచట్టముతో అలాంటిది చేయడం అబ్బుర మేమిటి? అందులోకీ చచ్చుకల్లబ్బులను కొట్టడానికి శాసనసభకు శక్తిలేకపోతుందా? అంచేత కల్లబ్బువెర్రి కట్టి పెడతారో, లేకపోతే కల్లబ్బులమీదికి దండెత్తమన్నారో చెప్పండి!

# మాతృప్రేమ

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తిగారు, బి.ఏ.

ద్విపద.

తనశిశువేయని తరుణియొక్కర్తు
తనశిశువేయని తరుణియింకోర్తు
జగడమాడుచు నరేశ్వరుసభాస్థలికి
తగవుదీర్చుకొనంగ తారేగుదెంచి
నిసుగును నరనాథు నికటాననుంచి
"వసుమతీనాథ! మావాదంబువినుము
ఈనిసుగిందులో నెవరిదోచెప్పి
మానితముగ వాదుమాన్పి యిర్వురికి
తగురీతిన్యాయంబు దయచేయుమయ్య
సుగుణనిధీ!" యని సుందరుల్ పలుక
రాజేదియునుమాట రాకుండనుండి
యోజించియోజించి యూరకున్నంత
సకలధర్మార్థ విచక్షణుండైన
అకలంకమతి సచివాగ్రణిపలికె
"ఈతగవునుమీరలే తీర్చుకొనుడి
నేతృసమ్ముఖమున నిల్చుండియిచట."
ఆమాటలాలించి యాపూవుబోండ్లు
మోమోటమునువీడి భూమీశునెదుట
శిశువుపైపడి ఒకచేయియొక్కర్తు
వెసమరొక్కర్తుక వేరొక్కచేయి
పట్టిఆశిశువును బాధింపదొడగ
గట్టిగాఏడ్వగా గడగె నాశిశువు
నిసుగుపై ప్రేమనిండిన నెమ్మనమున
అసలుతల్లితలంచెనట కొంతసేపు.
"ఏలయీబాలశిశువు నీలీలచేయొకటి
నేలాగియింకొక్కటీ యింతిలాగ
ఎవరిదగ్గరినున్న నేమయ్యెనాకు
ఎవరోఒకరుపెంచుటే నాకువలయు
కానయీశిశువు నిక్కాంతకేవదిలి
నేనింటికేగెద; కాని యీబిడ్డ
నిటులబాధింప నాకెట్లోర్చుమనసు"
ఇటుగొంతసేపు చింతించితావదిలె
శిశువును; మంత్రివీక్షించి యిదంత
అసలైనతల్లియా అంగనయనుచు
నిశ్చయంబొనరించి నృపతితోపలుక
నాశ్చర్యమందె నయ్యవనీశుడపుడు.
సహజపవిత్ర వాత్సల్యసంపూర్ణ
మహాహాతల్లిమనస్సు నటుపరీక్షించి
నిజమైనతల్లికే నిసుగునొసంగ
ప్రజలెల్లనుతియింప ప్రభుశిఖామణియు॥